

పండ్ల తోటలపై శిక్షణ

వినుకొండ: పండ్ల తోటలపై రైతుల గుర్తింపు శిక్షణ కార్యక్రమం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. హార్టికల్చర్ ఆఫీసర్ నజీరనూల్, ఏవో జి.వరలక్ష్మి పాల్గొన్నారు.



నేడు ప్రతిష్ఠా మహోత్సవం

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లి హరిజన వాడలో క్రీస్తు కృప లూథరన్ దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవం గురువారం జరగనుంది.



హుండీ కానుకలు లెక్కింపు

అద్దంకి: శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. రూ.14.28 లక్షలు వచ్చినట్లు సహాయ కార్యదర్శి తిమ్మనాయుడు తెలిపారు.

న్యూస్‌రీల్

తెనాలిలో సదరం క్యాంప్ పునః ప్రారంభం



తెనాలి అర్బన్: వికలాంగుల ధ్రువ పత్రాల పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో బుధవారం ప్రత్యేక సదరం క్యాంప్‌ను నిర్వహించారు. ఆర్థో-100, ఈఎన్‌టీ-50, సైక్రాటిక్ విభాగాలకు చెందిన 50 మంది వికలాంగులు పరీక్షలు చేయించుకున్నారు. గురు, శుక్రవారాలలో కూడా క్యాంప్ నిర్వహించనున్నట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు.

పాలిసెట్‌లో 97.07 శాతం ఉత్తీర్ణత



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి గత నెల 30న జరిగిన పాలిసెట్-2025 ఫలితాల్లో గుంటూరు జిల్లాలో 97.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో బాలురను అధిగమించిన బాలికలు 97.99 శాతం ఉత్తీర్ణత సాధించారు.

- గుంటూరు జిల్లాలో పాలిసెట్‌కు హాజరైన 4,129 మంది విద్యార్థుల్లో 4,008 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 2,587 మంది పరీక్ష రాయగా, 2,497 మంది ఉత్తీర్ణులయ్యారు. 96.52 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- బాలికలు 1,542 మంది హాజరు కాగా, 1,511 మంది ఉత్తీర్ణులయ్యారు. 97.99 శాతం ఉత్తీర్ణత నమోదైంది.
- అక్కల బిమల్ రాజేంద్ర 191వ ర్యాంకు, వేమా ప్రేమ్‌కుమార్ 285వ ర్యాంకు, కాకుమాను అన్యూన్య 326వ ర్యాంకు సాధించి జిల్లాలో టాపర్లుగా నిలిచారు.

హోమ్స్‌ను సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి



గుంటూరు లీగల్: క్యాలెండర్ యాక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు బుధవారం గుంటూరులోని హోమ్స్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ సందర్శించారు. దిశా వన్ స్టాప్ సెంటర్, శిశు గృహం, స్వధార్ హోమ్, లీమా డెఫ్ అండ్ డమ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను సందర్శించారు. శిశు గృహం, లీమా డెఫ్ అండ్ డమ్ రెసిడెన్షియల్ స్కూలులో పిల్లలకు అందుతున్న సదుపాయాలను తనిఖీ చేశారు. అక్కడున్న అధికారులతో మాట్లాడారు. పిల్లలకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాలు, రూంలను పరిశీలించారు. దిశా వన్ స్టాప్ సెంటర్, స్వధార్ హోమ్‌లో మహిళలకు అందుతున్న సదుపాయాల గురించి వాకబు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి రెజిస్టర్స్‌ను పరిశీలించారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఫ్రీ లీగల్ ఎయిడ్, బాధిత మహిళలకు అందే పరిహారం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు, హోమ్ నిర్వాహకులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన అవసరం



గుంటూరు వెస్ట్: ప్రకృతి వైపరీత్యాలు, భారీ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు కనీస అవగాహన ఉంటే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) షేక్ ఖాజావలి అన్నారు. స్థానిక కలెక్టరేట్ ఆవరణలో బుధవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌లో ఆయన మాట్లాడారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు భయాందోళనకు గురికాకూడదని తెలిపారు. విద్యుత్ వినియోగించిన తరువాత వీలైనంత వరకు వాటిని పూర్తిగా ఆఫ్ చేసుకోవాలని, దీనివల్ల షార్ట్ సర్క్యూట్ జరగదని చెప్పారు. తరచూ విద్యుత్ వైర్లు, స్విచ్‌బోర్డులు తనిఖీ చేసుకోవాలని సూచించారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టైం స్లాట్లు.. తప్పని పాట్లు

- రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ విధానం అమలు
- చిన్న పొరపాటు జరిగినా మళ్లీ తీసుకోవాల్సిందే
- రెండోసారి రూ.200.. మూడోసారి రూ.500 వడ్డన
- ప్రస్తుతం రోజుకు 39 రిజిస్ట్రేషన్లకే అవకాశం
- మధ్యాహ్నం నుంచే ఎక్కువ స్లాట్లు

అమరావతి: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన టైం స్లాట్ విధానంతో క్రయవిక్రయదారులకు ఇబ్బందులు తప్పటం లేదు. స్లాట్ తీసుకున్నాక ఎన్ని పనులున్నా ఆ టైంకు వెళ్లాల్సిందే. కొంచెం ఆలస్యమైనా.. చిన్న పొరపాటు జరిగినా... అది రద్దు అవుతోంది. మరోమారు స్లాట్ తీసుకోక తప్పడం లేదు. అందుకోసం మరో రూ.200 సమర్పించుకోవాలి. గతంలో రోజులో ఎన్ని డాక్యుమెంట్లు అయినా రిజిస్ట్రేషన్ చేసేవారు. నూతన విధానంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రోజుకు 39 రిజిస్ట్రేషన్‌లు మాత్రమే చేయొచ్చు. తాము అనుకున్న సమయం కాకుండా స్లాట్ దొరికినప్పుడే వ్యయప్రయాసలకు ఓర్చి దూర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు క్రయవిక్రయదారులు చేరుకోవాల్సి వస్తోంది. రిజిస్ట్రేషన్ పనిమీద వచ్చిన వారు ఆ రోజు స్లాట్ దొరక్కపోతే మరుసటి రోజు వరకు వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

రెండోసారి బుక్ చేసుకుంటే రూ.200

రిజిస్ట్రేషన్ కోసం ఒకసారి టైమ్ స్లాట్ బుక్ చేసుకుంటే కచ్చితంగా అదే సమయానికి వెళ్లాల్సి ఉంటుంది. ఓ పది నిమిషాలు ఆలస్యంగా వెళ్లినా, లేక డాక్యుమెంట్‌లో ఏదైనా పొరపాట్లు జరిగినా స్లాట్ టైం ముగిసిపోతుంది. వారు మళ్లీ స్లాటు బుక్ చేసుకోవాలంటే అదనంగా రూ.200 కట్టాలి. ఇక మూడో సారి అయితే రూ. 500 చెల్లించాలి. ఫలితంగా క్రయ విక్రయదారులపై మరింత ఆర్థికభారం పడుతోంది.



రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ వెబ్‌సైట్ పేజీ

పల్నాడు జిల్లాలో అమరావతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రాజధాని అమరావతికి సమీపంలో ఉండటంతో రిజిస్ట్రేషన్‌లు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈ కార్యాలయం పరిధిలో మండలంలోని అమరావతి, ధరణికోట, దుడుగు, మల్లాది, లింగాపురం, నరుకుళ్ళపాడు, ఎండ్రాయి, కర్లపూడి, ఉంగుటూరు, పెదమద్దూరు, వైకుంఠపురం, పెదకూరపాడు మండలంలోని బలుసుపాడు, తాడికొండ మండలంలోని మోతడక, పాములపాడు గ్రామాలున్నాయి. ఇవన్నీ రైతులు ఎక్కువగా ఉన్న గ్రామాలు కావటంతో ఉదయం పూట వ్యవసాయం, లేక పాడి పనులు చూసుకుని రిజిస్ట్రేషన్‌ల కోసం మధ్యాహ్నం భోజనం చేసుకుని తీరుబడిగా వస్తుంటారు. ఎంత సమయమైనా వేచి ఉండి రిజిస్ట్రేషన్ చేయించుకుని వెళ్లేవారు. ప్రభుత్వం నూతనంగా అమలులోకి తీసుకొచ్చిన టైమ్ స్లాట్ విధానంతో ఉదయం పూట టైమ్ స్లాట్‌లు పెద్దగా బుక్ కావటం లేదు. మధ్యాహ్నం నుంచి రిజిస్ట్రేషన్‌లు ఎక్కువ ఉండటంతో స్లాట్ దొరకడం లేదు. కొంతమంది రిజిస్ట్రేషన్‌లను వాయిదా వేసుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక రోజులో కేటాయించిన 39 రిజిస్ట్రేషన్‌లు పూర్తయి.. ఇంకా మిగిలి ఉన్న వారికి సాయంత్రం 5గంటల తర్వాత కూడా రిజిస్ట్రేషన్‌లు చేయవచ్చు. కానీ ఇక్కడ రిజిస్ట్రేషన్లు అలా చేయటం లేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి టైమ్ స్లాట్ కొంత ఇబ్బందిగా మారింది. ఒక రోజు రిజిస్ట్రేషన్ కాకపోతే మరుసటి రోజు ఇక్కడే ఉండి పని పూర్తి చేసుకోవాల్సి వస్తోంది. ఒకవేళ ఆ రోజు కూడా ఆన్లైన్ సైట్ పని చేయకపోతే పడిగాపులు తప్పడం లేదు.

గతంలో ఎప్పుడైనా రిజిస్ట్రేషన్

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో టైం స్లాట్ విధానం 2020 నుంచి వినియోగదారులకు అందుబాటులో ఉండేది. గత ప్రభుత్వ హయాంలో క్రయ విక్రయదారులే తమ డాక్యుమెంట్లను తయారు చేసుకుని వారికి అనువైన సమయంలో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లేలా పబ్లిక్ డేటా ఎంట్రీ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నూతనంగా టైం స్లాట్ విధానాన్ని అమలులోకి తీసుకొచ్చింది. గతంలో ఎప్పుడైనా టైం స్లాట్ బుక్ చేసుకునే అవకాశాన్ని ప్రస్తుతం మార్చి తీసుకొచ్చారు.

ఎంతో ఇబ్బంది పడుతున్నాం



టైం స్లాట్ విధానంతో ఎంతో ఇబ్బందులు పడుతున్నాం. గతంలో స్లాట్ అన్‌లిమిటెడ్‌గా బుక్ చేసేందుకు అవకాశం ఉండేది. ప్రస్తుతం లిమిటెడ్ చేయడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే కొనుగోలుదారులకు, విక్రయదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. చిన్న తప్పు దొర్లినా స్లాట్ రద్దు అవుతోంది. మళ్లీ స్లాట్ బుక్ చేసుకోవాల్సి వస్తోంది.

– వై.పాపారావు, అమరావతి

స్లాట్ బుక్ చేసుకున్న వారికి ప్రాధాన్యం

స్లాట్ విధానం వచ్చిన తర్వాత ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఒకటో రెండో స్లాట్‌లు బుక్ అవుతున్నాయి. మధ్యాహ్నం నుండి స్లాట్‌లు అధికంగా బుక్ చేసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోజుకు మాకు ఇచ్చిన 39 స్లాట్‌లు పూర్తయితేనే 5 గంటల తర్వాత స్లాట్ బుకింగ్ లేని వాళ్లకు రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నాం.

– పి.వెంకటరెడ్డి, సబ్‌రిజిస్ట్రార్, అమరావతి



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వేచి చూస్తున్న క్రయవిక్రయదారులు

అమరావతి మ్యూజియం అభివృద్ధికి కేంద్రం సహకారం

అమరావతి: స్థానిక మహా చైత్యం, పురావస్తు మ్యూజియంల అభివృద్ధి కోసం ఐదు నెలల క్రితం భారత ప్రధానమంత్రి కార్యాలయంలో వినతిపత్రం సమర్పించగా దశల వారీగా అభివృద్ధి చేస్తామని కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ వి.ఎస్.బాడీజర్ సమాధానమిచ్చారని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి పురావస్తు మ్యూజియం, కేంద్ర పురావస్తు శాఖ మరియు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం మ్యూజియం సంస్కరణలకు అనుగుణంగా దశలవారీగా అభివృద్ధి పనులు చేడతామని కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ లెటర్ ద్వారా తనకు ప్రత్యుత్తరమిచ్చారన్నారు. అమరావతి మహా చైత్యాన్ని, మ్యూజియాన్ని నిత్యం సందర్శకులు, ప్రముఖులు సందర్శిస్తారన్నారు. అంతటి మహోన్నతమైన చరిత్ర కనుమరుగు కాకుండా కాపాడటానికి కేంద్ర పురావస్తు శాఖ దశల వారీగా అభివృద్ధి చేస్తామని చెప్పడం ఆనందదాయకమన్నారు.

కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసిన ఉద్యోగికి షోకాజ్ నోటీసు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో అవుట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న ఓ ఉద్యోగి కమిషనర్ సంతకం ఫోర్జరీ చేసి నకిలీ ఐడీ కార్డ్ సృష్టించాడు. తనను పర్మినెంట్ చేయాలని హైకోర్టును ఆశ్రయించడంపై నగరపాలక సంస్థ అధికారులు షోకాజ్ నోటీసు సిద్ధం చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోరింగ్స్ పద్ధతిలో అటెండర్‌గా పనిచేస్తున్న డి. దుర్గారావు 1998లో ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తూ మరణించిన కె. సౌభాగ్యమ్మ(ఎఫ్ఎన్‌టి) ఎంప్లాయి ఐడీ నంబర్ 1070ను కార్యాలయ సిబ్బంది సహకారంతో సంపాదించాడు. ఆ ఐడీతో నకిలీ గుర్తింపు కార్డు సృష్టించి, దానిపై కమిషనర్ పులి శ్రీనివాసులు సంతకం ఫోర్జరీ చేయించాడు. తాను గత 25 ఏళ్లకు పైగా నగరపాలక సంస్థలో పని చేస్తున్నానని తన సర్వీసును రెగ్యులరైజ్ చేయాలని హైకోర్టును ఆశ్రయించాడు. దుర్గారావు నియామకమైన సమయంలో పులి శ్రీనివాసులు లేరని.. లాలాపేట పోలీస్ స్టేషన్‌లో కమిషనర్ సంతకం ఫోర్జరీపై ఫిర్యాదు చేశారు.

బీసీ నేతపై 'కూటమి' కుట్రలు

- మాచర్ల మున్సిపల్ చైర్మన్ తురకా కిషోర్‌పై కూటమి ప్రభుత్వం అక్రమ చర్యలు
- 15 కౌన్సిల్ మీటింగ్‌లకు హాజరుకాలేదని పదవి నుంచి తొలగింపు
- వడ్డెర సామాజిక వర్గానికి చెందిన నేతకు పదవి కట్టబెట్టిన వైఎస్సార్‌సీపీ
- రాజకీయంగా ఎదగడం చూసి ఓర్వలేక ఇప్పటికే అక్రమ కేసులతో వేధింపులు
- కూటమి సర్కారు తీరును వ్యతిరేకిస్తున్న బీసీ సంఘాల నాయకులు

సాక్షి, నరసరావుపేట: బలహీన వర్గాలకు చెందిన సామాన్యులు కూడా రాజకీయంగా ఎదగడానికి వైఎస్సార్‌సీపీ దోహదం చేస్తే.. దాన్ని కొనసాగించాల్సిన కూటమి ప్రభుత్వం వారి ఉన్నతిని ఓర్వలేక బీసీలపై కక్షసాధింపు చర్యలకు దిగుతోంది. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి రాజకీయంగా పదవులు దక్కని సామాజిక వర్గాలను గుర్తించి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పదవులు కట్టబెట్టారు. అందులో భాగంగా స్థానిక నేత పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రోత్సాహంతో వడ్డెర సామాజికవర్గానికి చెందిన తురకా కిషోర్‌కు మాచర్ల మున్సిపల్ చైర్మన్ పదవి ఇచ్చారు. దీనిపై వడియరాజులతోపాటు ఇతర బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన బీసీ నేత రాజకీయంగా ఎదగడం సహించని టీడీపీ నేతలు కుట్ర పన్నారు. మాచర్ల మున్సిపల్ చైర్మన్‌గా ప్రస్తుతం సెలవుపై ఉన్న తురకా కిషోర్‌ను తొలగిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని ఆయన సొంత సామాజికవర్గంతో పాటు బీసీ వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. బలహీన వర్గాలకు చెందిన వారు రాజకీయం ఎదుగుతుంటే ప్రోత్సహించాల్సింది పోయి కక్షకట్టి అణగతొక్కడం ఏంటని ప్రశ్నిస్తున్నాయి.



తురకా కిషోర్

ఇప్పటికే అక్రమ కేసులతో కక్ష సాధింపు...

కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి బీసీ వర్గానికి చెందిన తురకా కిషోర్‌పై కక్ష సాధింపు చర్యలు మొదలు పెట్టారు. ఇప్పటికే పదుల సంఖ్యలో అక్రమ కేసులు నమోదు చేశారు. ఎప్పుడో జరిగిన సంఘటనలపై కిషోర్‌కు సంబంధం లేకపోయినా టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఫిర్యాదు అందిందన్న నెపంతో కొత్తగా కేసులు కడుతున్నారు. ఒక కేసులో బెయిల్ రాగానే మరో కేసు నమోదు చేసి జైలు బయటే పోలీసులు ఎదురు చూసి మరీ అరెస్టు చేశారు. పీడీ యాక్టు నమోదు చేసేంత నేర తీవ్రత లేకపోయినా కక్షతో కిషోర్‌పై పీడీ యాక్టు అమలు చేసి, రాజమహేంద్రవరం జైలుకు పంపారు. కిషోర్‌పై పీడీ యాక్టు సరికాదని అడ్వైజరీ కమిటీ ఇచ్చిన నివేదిక మేరకు రెండు రోజుల క్రితం పీడీ యాక్టు ఎత్తేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. మరోవైపు కిషోర్‌ను ఎలాగైనా జైలులో ఉంచాలన్న కుట్రతో మాచర్ల టౌన్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం మరో అక్రమ కేసు నమోదు చేశారు. ఇలా సుమారు 130 రోజులకుపైగా కిషోర్‌ను జైలులోనే ఉంచారు. మిగిలిన రోజులు కూటమి నేతల దౌర్జన్యాలకు భయపడి ఇతర ప్రాంతాల్లో తలదాచుకున్నారు. దీంతో కొన్ని కౌన్సిల్ మీటింగ్‌లకు హాజరుకాలేదు. 15 కౌన్సిల్ మీటింగ్‌లకన్నా ఎక్కువ గైర్హాజరయ్యారన్న సాకుతో కిషోర్‌ను పదవి నుంచి ప్రభుత్వం తొలగించింది. బలహీనవర్గాలపై కూటమి ప్రభుత్వ తీరును సరికాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఇక నాటి కళకళ..!

- చిలకలూరిపేటలో మూడు రోజుల మహోత్సవం
- కళల పండుగకు ముస్తాబైన సీఆర్ క్లబ్
- ఒకే వేదికపై నవరత్నాల్లాంటి కళారూపాలు

చిలకలూరిపేట: కళల పరవళ్లు ఎగసిపడే పండుగ సమయం వచ్చేసింది! నాటక రంగానికి నిలయమైన చిలకలూరిపేట పట్టణం మళ్లీ కళాకారుల సందడితో కళకళలాడబోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో 9వ ఆహ్వాన నాటిక పోటీలు ఈ నెల 16, 17, 18వ తేదీల్లో వైభవంగా జరగబోతున్నాయి. చిలకలూరిపేట సీఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్ ప్రేక్షకుల కోసం అందంగా సన్నద్ధమవుతోంది. 'చిలకలూరిపేట కళాపరిషత్, సీఆర్ క్లబ్' సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మహోత్సవానికి ప్రముఖ నాటక సమాజాలు, రచయితలు, సృజనాత్మక దర్శకులు, అభినయ నిపుణులు హాజరుకానున్నారు. వినోదంతో పాటు ఆలోచనలకు ఆహ్వానం పలికే కళారూపాలను ఆస్వాదించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ పోటీలకు కళాపరిషత్ అధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, సీఆర్ క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు రథసారథులు కాగా.. ప్రముఖ రంగస్థల దర్శకుడు షేక్ షఫీ తదితరులు ఆయా నిర్వహణ పనుల్లో భాగస్వాములయ్యారు.



నాటిక ప్రదర్శన (ఫైల్)



సీఆర్ క్లబ్ ఆడిటోరియం

ప్రదర్శనల వివరాలు ఇలా..

- 16న స్వర్గీయ మద్ది లక్ష్మయ్య కళా ప్రాంగణంలో సాయంత్రం 7 గంటలకు మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తారు. 7.30 గంటలకు కంచర్ల సూర్య ప్రకాష్ రచనకు, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించిన కళాంజలి హైదరాబాద్ వారి 'రైతే రాజు' నాటిక ప్రదర్శించనున్నారు.
- 8:30 గంటలకు సభా కార్యక్రమం, 8:45 గంటలకు మద్దుకూరి రవీంద్రబాబు రచించి దర్శకత్వం వహించిన మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ చిలకలూరిపేట వారి 'మా ఇంట్లో మహాభారతం' నాటిక ప్రదర్శన ఉంటుంది. 10 గంటలకు అక్కల తామేశ్వరయ్య రచనకు వడ్డాది సత్యనారాయణ దర్శకత్వం వహించిన యువభేరి ఆర్ట్స్ హైదరాబాద్ వారి 'నా శత్రువు' నాటిక ప్రదర్శిస్తారు.
- 17వ తేదీన స్వర్గీయ ఇందుమల్లి రాజ్‌కుమార్ కళా ప్రాంగణంలో..

రాత్రి 7:30 గంటలకు ఆకురాతి భాస్కరచంద్ర రచనకు ఎస్ఎం బాషా దర్శకత్వం వహించిన మిత్ర క్రియేషన్స్ హైదరాబాదు వారి 'ఇది రహదారి కాదు' నాటిక ప్రదర్శితం కానుంది. 8:45 గంటలకు పరమాత్ముని శివరాం రచనకు రమేష్ మంచాల దర్శకత్వం వహించిన కళాభారతి కరీంనగర్ వారి 'చీకటి పువ్వు' నాటిక ప్రదర్శన ఉంటుంది. 10 గంటలకు డేవిడ్‌రాజు రచించి దర్శకత్వం వహించిన భద్రం ఫౌండేషన్ విశాఖపట్నం వారి 'దొందు దొందే' నాటిక ప్రదర్శించనున్నారు.

- 18న స్వర్గీయ నాగభైరు సుబ్బారావు కళాప్రాంగణంలో.. రాత్రి 7:45 గంటలకు కావూరి సత్యనారాయణ రచనకు ఏపూరి హరిబాబు దర్శకత్వ వహించిన అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి 'చిగురు మేఘం' నాటిక ప్రదర్శిస్తారు. 8:45 గంటలకు అద్దేపల్లి భరత్ కుమార్ రచనకు ఎస్కే షఫీ దర్శకత్వం వహించిన ది అమేచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ వారి 'ఆలీతో సరదాగా' నాటిక ప్రదర్శన ఉంటుంది. అనంతరం సభా కార్యక్రమం జరుగుతుంది.
- 10:45 గంటలకు తాళాబత్తుని వెంకటేశ్వరరావు రచనకు అమృత లహరి దర్శకత్వం వహించిన అమృత లహరి ఆర్ట్స్ థియేటర్స్ వారి 'నాన్న నేను వచ్చేస్తా' నాటిక ప్రదర్శితం అవుతుంది.
- 11.50 గంటలకు శ్రీకృష్ణ మానసం నటులు గొట్టిపాటి కోటేశ్వరరావుచే ప్రత్యేక ప్రదర్శన ఉంటుంది.

నాటక సంస్థలకు జీవం పోసే యత్నం



సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, కళాకారుల్ని బతికించుకోవాల్సిన అవసరం ఉంది. కళల కాణాచి చిలకలూరిపేటలో ఎన్నో నాటక పరిషత్‌లు ఉన్నాయి. అవి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందాయి. ప్రస్తుతం సాంస్కృతిక సంస్థలు ఉన్నప్పటికీ నాటక రంగ పరిషత్‌లు కొంత కాలంగా నిలిచిపోయాయి. వాటికి తిరిగి జీవాన్ని పోసేందుకు చేస్తున్న ప్రయత్నంలో భాగమే చిలకలూరిపేట కళా పరిషత్, సీఆర్ క్లబ్ సమిష్టిగా నిర్వహిస్తున్న ఈ పోటీలు.

– చెరుకూరి కాంతయ్య, పరిషత్ అధ్యక్షుడు

ఒంటికాలిపై సీహెచ్‌ఓల నిరసన

17వ రోజుకు చేరిన సమ్మె

నరసరావుపేట: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత 17రోజులుగా సమ్మెచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(సీహెచ్ఓ) బుధవారం శిబిరంలో ఒంటికాలిపై నిలబడి తమ నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖలో గత ఆరేళ్ల నుంచి సీహెచ్‌ఓలుగా పనిచేస్తున్న వారు జీతభత్యాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చాలని కోరుతూ పట్టణంలోని స్టేషన్‌రోడ్డు గాంధీపార్కుకు ఎదురుగా సమ్మెచేస్తున్న విషయం విదితమే. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు అనుపమ మాట్లాడుతూ గత ఆరేళ్లుగా పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ఇతర ఉద్యోగులతో సమానంగా 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ప్రతి నెల జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ప్రతి ఏడాది ఐదుశాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఆర్థికమైన, ఆర్థికేతర సమస్యలను తీర్చే విధంగా హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం నెరవేర్చకపోతే ఈనెల 24 నుంచి శాంతియుత నిరవధిక సమ్మె ద్వారా నిరసనలు కొనసాగిస్తామన్నారు. తమ అసోసియేషన్ నాయకులను చర్చలకు పిలవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు సాగర్, రాము, మస్తాన్, వినోద్, ఏఐటీయూసీ నాయకులు కాసా రాంబాబు, ఉప్పలపాటి రంగయ్య, గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు ఈదర గోపీచంద్ పాల్గొన్నారు.



సమ్మె శిబిరంలో ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు

జిల్లా ప్రగతి పథంలో నడవాలి

- పర్యాటక రంగంపై దృష్టి సారించండి
- 20 సూత్రాల పథకం చైర్ పర్సన్ లంకా దినకర్

నరసరావుపేట: పల్నాడు జిల్లా 15 శాతం వృద్ధిరేటుతో ప్రగతి సాధించేలా అధికారులు పనిచేయాలని రాష్ట్ర 20 సూత్రాల పథకం చైర్ పర్సన్ లంకా దినకర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, నరసరావుపేట, మాచర్ల ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర శిల్పారామం సొసైటీ చైర్‌పర్సన్ మంజులారెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు శాఖలపై సుదీర్ఘంగా సమీక్షించారు. పర్యాటక రంగం అభివృద్ధికి జిల్లాలో ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయం విధానంలో 50 వేల ఎకరాలున్న విస్తీర్ణం 1.25 లక్షల ఎకరాలకు పెంచాలని ఆదేశించారు. ఒంగోలు జాతి గిత్తల వృద్ధికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అవసరాలకు తగినంత పాల ఉత్పత్తి పెంచాలని తెలిపారు. శ్రామికులకు రోజుకు రూ.300కి మించి వేతనాలు అందేలా ఉపాధి కల్పన, పశువులకు నీటి తొట్ల ఏర్పాటు, ఫారం పాండ్ల నిర్మాణం, కాల్వల మరమ్మతులు, అమృత్ సరోవర్ పనులలో లక్ష్యాలు చేరుకోవాలన్నారు. నీరు ఇవ్వకుండానే జల్ జీవన్ మిషన్ ద్వారా కుళాయిలు ఇంటింటికీ ఏర్పాటు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. పేదలకు మంజూరు చేసిన గృహాలలో మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నారని పేర్కొన్నారు. పనులలో పురోగతి సాధించలేని గుత్తేదారులను తొలగించాలని ఆదేశించారు. గ్రామాలలో సీసీ రోడ్లు నిర్మించి సైడ్ కాల్వలు విస్మరించడంపై నిలదీశారు. సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నియోజకవర్గంలో పదివేల సాధారణ కనెక్షన్లు లక్ష్యంతో విద్యుత్ శాఖ అధికారులు పనిచేయాలన్నారు. సర్వేలలో వివరాలు పక్కాగా సేకరించడం ద్వారా పథకాలకు అర్హులను గుర్తించొచ్చన్నారు. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి ఈ ఏడాది 28 కేసులు నమోదయ్యాయన్నారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గంగారావు, డీఆర్వో ఏకా మురళి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లంకా దినకర్

క్లుప్తంగా

పిడుగుపాటుకు మహిళ మృతి



యడ్లపాడు: పిడుగు పాటుకు మహిళ బుధవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కారుచోల గ్రామానికి చెందిన 15 మంది మహిళలు మిర్చికోతకు వెళ్లారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ఉరుములు, మెరుపులు రావడంతో పొలం నుంచి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో సమీపాన పిడుగు పడిన భారీ శబ్దం వినిపించడంతో వారిలో ముగ్గురు మహిళలు కింద పడిపోయారు. వారిలో షేక్ పర్వీన్(35) అనే మహిళ చెవుల నుంచి రక్తం కారి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు స్పృహ కోల్పోయారు. వీరిని యడ్లపాడు ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మృతురాలి భర్త షేక్ సైదావలి దివ్యాంగుడు. తాపీ పనులు చేస్తుండగా, వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపారు.

కెపాసిటీకి మించి ఇసుక రవాణా



తెనాలి: ఇసుక తవ్వకాల్లో నిబంధనలు అతిక్రమించడంతో పాటు ఇసుక రవాణాలోనూ ఉల్లంఘనలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. భారీ వాహనాల్లో కెపాసిటీకి మించి రవాణా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. భారత్ బెంజ్, టాటా బెంజ్ వంటి భారీ వాహనాల్లో ఇప్పుడు ఇసుక రవాణా ఎక్కువగా జరుగుతోందని తెలిసిందే. వీటి కెపాసిటీ 17–18 టన్నులు మాత్రమే. ఇందుకు భిన్నంగా ఒక్కో వాహనంలో రూ.40 టన్నులు, అంతకుమించిన పరిమాణంలోనూ రవాణా చేస్తున్నారు. వాహనం బాడీకీ పైన దాదాపు మీటరు ఎత్తులో లోడింగ్ చేస్తున్నారు. పైన పట్టా కప్పి మరీ గమ్యస్థానానికి రవాణా చేస్తున్నారు.

ఇసుక రవాణాతో అవస్థలు

ప్రతిరోజూ పరిమితికి మించిన లోడింగ్‌తో ఇసుక రవాణా వాహనాలు తెనాలి మీదుగా వెళుతున్నాయి. ఇసుక జారిపోతున్నా, వెనుక వచ్చే ద్విచక్రవాహన దారులకు ఇబ్బందిగా ఉంటున్నా ఎవరికీ పట్టటం లేదు. కొద్దిరోజుల కిందట వైకుంఠపురం దేవస్థానం సమీపంలోని రైల్వే లోబ్రిడ్జి వద్ద వాహనాల నుంచి ఇసుక జారిపోయి ప్రజలు ఇబ్బది పడ్డారు. కెపాసిటీ మించిన పరిమాణంతో ఇసుకను తరలిస్తున్న భారీ వాహనాలతో రోడ్లు, కల్వర్టులు దెబ్బతింటున్నాయి. తెనాలి పట్టణంలోంచి వాహనాలు ప్రతిరోజూ పట్టపగలే వెళుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోక పోవడంపై స్థానికులు విమర్శిస్తున్నారు.

చారిత్రక కట్టడం..మరమ్మతులకు సిద్ధం

- 130 ఏళ్ల చరిత్ర కల్గిన నరసరావుపేట ఆర్డీఓ కార్యాలయం
- కార్యాలయ స్వరూపం మారకుండా మరమ్మతులు
- సేవలకు ఆటంకం కలగకుండా సర్వే కార్యాలయం నుంచి రెవెన్యూ సిబ్బంది విధులు



బ్రిటిష్ కాలం నాటి కట్టడంలో ఆర్డీఓ కార్యాలయం



శిథిలావస్థకు చేరిన కార్యాలయం పై కప్పును తొలగిస్తున్న కార్మికులు

నరసరావుపేటటౌన్: బ్రిటిష్ హయాంలో నిర్మించబడి ప్రజలకు సేవలు అందిస్తున్న ఆర్డీఓ కార్యాలయానికి అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. సుమారు 130 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆర్డీఓ కార్యాలయం కాలగమనంలో శిథిలావస్థకు చేరింది. బ్రిటిష్ పాలనా కాలంలో 1894–95 సంవత్సరాల్లో నిర్మితమైన ఈ భవనం, అప్పటినుంచి ప్రజలకు రెవెన్యూ సేవలందిస్తూ, అధికార యంత్రాంగానికి కీలక కేంద్రంగా నిలిచింది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా భవనం పైకప్పు పాక్షికంగా దెబ్బతింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నరసరావుపేట రెవెన్యూ డివిజన్ అతి పెద్దది. ఎన్నో విలువైన రికార్డులు కార్యాలయంలో భద్రపరిచారు. సరైన రక్షణ చర్యలు లేక ఇప్పటికే కొన్ని రికార్డులు పాడయ్యాయి. ఈ క్రమంలో అధికారులు మరమ్మతులకు ఉపక్రమించారు.

వర్షం వస్తే ఇబ్బంది..

వర్షాకాలంలో సిబ్బంది తమ విధులను నిర్వర్తించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భారీ వర్షం వస్తే వర్షపు నీరు కార్యాలయంలోకి చేరుతుంది. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంప్యూటర్లకు రక్షణ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. రెవెన్యూ సేవలకు అంతరాయం లేకుండా కొనసాగేందుకు, తాత్కాలికంగా సర్వే కార్యాలయం నుంచి సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. నిత్యం వందలాది ప్రజల అవసరాలకు నిలయంగా మారుతుండటంతో, భవన మరమ్మతుల తర్వాత మరింత సమర్థవంతంగా సేవలు అందించనుంది.

చరిత్రను కాపాడుతూ ఆధునిక పనులు



చరిత్రకు చిహ్నంగా ఉన్న కార్యాలయ స్వరూపాన్ని ఏమాత్రం మార్చకుండా అధునాతన టెక్నాలజీతో మరమ్మతులు చేపడుతున్నాం. కార్యాలయ ప్రాంగణంలో ఉన్న డివిజినల్ సర్వే కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండి సేవలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. అధికారుల పర్యవేక్షణలో త్వరితగతిన మరమ్మతులు చేపట్టి కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం.
– కె.మధులత, నరసరావుపేట ఆర్డీఓ

హెచ్ఐవీ మహిళలకు క్యాన్సర్ పరీక్షలు

ఏర్పాట్లపై నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలో ఏపీ శాక్స్ అధికారుల సమీక్ష



సూపరింటెండెంట్ సురేష్‌కుమార్‌తో సమావేశమైన ఏపీ శాక్స్ అధికారులు

నరసరావుపేట: స్థానిక ఏరియా వైద్యశాలలో హెచ్ఐవీతో జీవిస్తున్న మహిళలకు త్వరలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) విభాగంతో కలిసి ఎయిడ్స్ కంట్రోల్ అధికారులు దీర్ఘకాలిక వ్యాధులైన రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేసేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఏపీ శాక్స్ జాయింట్ డైరక్టర్ డాక్టర్ పి.అంకినీడుప్రసాదు, డీడీ సీఎస్‌టీ డాక్టర్ చక్రవర్తి, పెప్‌ఫార్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజేంద్రప్రసాదు షేర్ ఇండియా అధికారులు డాక్టర్ జయకృష్ణ బుధవారం ఏరియా వైద్యశాలను సందర్శించి హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ కుమార్, గైనకాలజీ విభాగ అధిపతులతో ఈ అంశంపై చర్చించారు. క్యాన్సర్ వ్యాధి స్క్రీనింగ్ చేయటం వలన హెచ్ఐవీతో జీవిస్తున్న వారికి త్వరగా షుగర్, బీపీ, క్యాన్సర్ గుర్తించి ముందుగానే చికిత్స ప్రారంభించటం తద్వారా వారి జీవితకాలం పొడిగించే అవకాశం ఉన్నందున దీనికి కావాల్సిన సహాయసహకారాలు అందజేసేందుకు తాము సిద్ధమని హాస్పిటల్ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆర్ఎంఓ డాక్టర్ కె.ఏడుకొండలు, డాక్టర్ దయానిధి, గైనకాలజీ డాక్టర్ మంత్రూ నాయక్, ఏఆర్‌టీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద పాల్గొన్నారు.

చిన్నారి మేధావి ప్రదీప్ నారాయణకు అరుదైన గుర్తింపు

తెనాలి: రూరల్ మండలం గుడివాడకు చెందిన చిన్నారి మేధావి బండికళ్ల ప్రదీప్‌నారాయణకు మరో గౌరవం దక్కింది. ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ వరల్డ్‌వైడ్ ఫౌండేషన్ 'ఇంటర్నేషనల్ బెస్ట్ అచీవర్ అవార్డు' లభించింది. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ, ఎంఎస్ఎంఈ, నీతి అయోగ్‌ల సహకారంతో ఫౌండేషన్ ఇటీవల విశాఖపట్నంలోని ప్రెస్‌క్లబ్‌లో ఇంటర్నేషనల్ సోషల్ అవార్డ్స్ ప్రదానోత్సవం నిర్వహించింది. ఇందులో ప్రదీప్‌నారాయణకు ఈ గౌరవాన్ని అందజేశారు. ప్రస్తుతం నాలుగేళ్ల వయసున్న చిన్నారి 23 నెలల వయసు నుంచే అద్భుత జ్ఞాపకశక్తిని ప్రదర్శిస్తున్నాడు. తొలుత 150 పైగా వస్తువులు, కూరగాయలు, పక్షుల పేర్లను చెప్పాడు. ప్రస్తుతం 500 పైగా జంతువులు, వాహనాలు, జెండాలు, ఆకారాలు, రంగులు, ఫలాలు, కూరగాయలు, శరీర భాగాలు, ఆటబొమ్మలు, వస్త్రధారణ వంటి విభిన్న అంశాలను గుర్తించి చెప్పగలిగిన ప్రతిభను సొంతం చేసుకున్నాడు. భారత జాతీయ గీతాన్ని కేవలం 52 సెకన్లలోనే శ్రద్ధగా పాడుతున్నాడు. ఇంతటి ప్రతిభకుగాను 10 జాతీయ, 11 అంతర్జాతీయ అవార్డులను అందుకున్నాడు. తల్లిదండ్రులు చిన్నారిలోని జ్ఞాపకశక్తిని గుర్తించి, తగిన శిక్షణనిస్తూ సంబంధిత వీడియోలను సంస్థలకు పంపుతూ వస్తున్నారు. ఆ క్రమంలోనే అవార్డులు లభిస్తున్నాయి.

ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం

బాపట్ల: ప్రజా ఉద్యమాల ద్వారానే సమస్యల పరిష్కారం సాధ్యమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవి పిలుపునిచ్చారు. రైతాంగం, కార్మికులపై భారం వేస్తూ దోపిడీ శక్తుల ప్రయోజనాల కోసం కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రమైన బాపట్లలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో రమాదేవి మాట్లాడారు. జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు టి.కృష్ణమోహన్ అధ్యక్షత వహించిన సభలో ఆమె మాట్లాడుతూ.. ఉద్యమాల ద్వారా ప్రజల పక్షాన పోరాటం చేయొచ్చు అన్నారు. సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. బాబురావు మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో నల్లబర్లీ పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

డాబా పైనుంచి పడి యువతి మృతి

ఫిరంగిపురం: సెల్‌ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు డాబా పైనుంచి యువతి కిందపడి మృతి చెందిన సంఘటన ఫిరంగిపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రసూల్‌పేటలో నివాసం ఉంటున్న సీహెచ్. జ్యోత్స్న వేళాంగిణి మేరి (17) నరసరావుపేటలోని ప్రైవేట కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. సెలవలు కావడంతో ఇంటి వద్ద ఉంటోంది. మంగళవారం రాత్రి తల్లి, చెల్లితో భోజనాలు చేసిన తరువాత డాబా పై అంతస్తుపై పడుకునేందుకు వెళ్లారు. జ్యోత్స్న తల్లి వద్దనున్న ఫోన్ తీసుకుని స్నేహితురాలితో పిట్టగోడపై కూర్చుని మాట్లాడుతూ ప్రమాదవశాత్తు కిందకు పడి పోయింది. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. తండ్రి రాజేష్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, గుంటూరులోని ప్రభుత్వ వైద్యశాలలో శవ పంచనామా చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

పిడుగు పడి కొబ్బరి చెట్టు దగ్ధం

యద్దనపూడి: మండలంలో బుధవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు బలంగా వీచాయి. కొద్దిపాటి వర్షం కూడా పడింది. మండలంలోని పోలూరు గ్రామంలో కొబ్బరిచెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగాయి. చెట్టుపక్కన ఉన్న వరిగడ్డి వామి కూడా కొద్ది మేర కాలిపోయింది. గ్రామం నడిబొడ్డున ఉన్న చెట్టుపై పిడుగుపడినా ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. స్థానికులు ఆ శబ్దానికి భయపడిపోయారు. మంటలు చెలరేగకుండా ఆర్పివేశారు.

వైఎస్సార్ సీపీ పోరాటాలతోనే ఆర్ఓబీ పనులు

- సీఎం పేషీ నుంచి అక్షింతలతో కదిలిన కూటమి నేతలు
- అభివృద్ధి పనులపై ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతాం
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



మాట్లాడుతున్న కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ చేసిన పోరాటాలతోనే కూటమి ప్రభుత్వం దిగి వచ్చి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) పనులను మొదలు పెట్టిందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... జానపాడు–పిడుగురాళ్ల గ్రామాల మధ్య ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు రైల్వే ఓవర్ బ్రిడ్జిని నిర్మాణానికి 2022లోనే రూ. 52 కోట్లను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి మంజూరు చేయించటం జరిగిందన్నారు. అనంతరం టెండర్లు పిలిచి, ఆక్రమణలను తొలగించటం, విద్యుత్ దీపాలను కూడా తొలగించటం జరిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి 11 నెలలు అవుతున్నా ఆ పనులు అంగుళం కూడా ముందుకు కదల్లేదన్నారు. దీనిపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రెండు, మూడు నెలల నుంచి ఉద్యమం మొదలు పెట్టామని, హైకోర్టులో సైతం ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేసేందుకు సిద్ధమవుతున్నామని తెలుసుకున్న సీఎం పేషీ అధికారులు స్థానిక టీడీపీ నేతలకు అక్షింతలు వేయడంతో ఈ నెల 15వ తేదీన మళ్లీ శంకుస్థాపన చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. పదిసార్లు శంకుస్థాపన చేసినా వైఎస్సార్ సీపీ ఎప్పుడు అడ్డుకోదని, మేం నాటిన విత్తనం వృక్షమవ్వాలి, ప్రజలకు ఫలాలు అందివ్వాలని ఆయన అన్నారు.

ట్రాఫిక్ సమస్యకు చెక్

రైల్వే బ్రిడ్జితో జానపాడు గ్రామ రూపురేఖలు కూడా మారతాయని, పిడుగురాళ్ల పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుందన్నారు. పనులు వేగవంతమవ్వాలని, వచ్చే సంవత్సరంన్నర, రెండు సంవత్సరాలలో పనులు పూర్తయ్యేంత వరకు మా ఉద్యమం కొనసాగుతుందన్నారు. పిడుగురాళ్ల పట్టణానికి మంచి పార్కు కావాలని.. చెరువు అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులను మంజూరు చేయించామని, చెరువు ఆక్రమణలకు గురికాకూడదనే ఉద్దేశంతో చుట్టూ ప్రహరీ సైతం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇప్పుడు దానిని కూడా ముందుకు తీసుకొని వెళ్తామని కూటమి ప్రభుత్వం చెబుతుందని.. ఆ నిర్ణయాన్ని సైతం స్వాగతిస్తామన్నారు. ఈ పనులన్ని పూర్తి అయ్యేంత వరకు ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందని తెలిపారు.

పూలంగి సేవతో.. పవళింపుము స్వామీ!

- రంగనాథుడికి అంగరంగ వైభవంగా పుష్పయాగం
- సొలస ఆలయంలో ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ



పూలంగి సేవకు పలు రకాల పుష్పాలను తెస్తున్న మహిళలు



బహుళ పుష్పాలంకారకృతుడైన రంగనాయక స్వామి

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో శ్రీభూ సమేత రంగనాయక స్వామి ఆలయం బుధవారం భక్తజనంతో కళకళలాడింది. ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు కైంకర్యాల నిర్వహణ అట్టహాసంగా నిర్వహించారు. బుధవారం వేకువజామునే రంగనాథస్వామికి ఎన్నోరకాల పుష్పాలను భక్తులు మేళతాళాలతో భజాభజింత్రీలతో గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. అర్చకులు పర్చూరి రామకృష్ణమచార్యులు ఆధ్వర్యంలో భక్తులు స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి పూలంగి సేవలు అందించారు. హోమపూజల్ని ముగించారు. సాయంత్రం అత్యధిక మంది భక్తులు పాల్గొని ద్వాదశ ప్రదక్షిణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పవళింపు సేవ చేశారు. భక్తులకు ప్రసాద వినియోగం చేశారు. ఆయా కార్యక్రమాలను ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి దంపతులు, అర్వపల్లి బ్రదర్స్, గ్రామపెద్దలు పర్యవేక్షించారు.

నరసరావుపేటలో 'సింగిల్' బృందం సందడి



విలేకరులతో మాట్లాడుతున్న చిత్ర హీరో శ్రీవిష్ణు, చిత్రంలో హీరోయిన్లు, దర్శకుడు

నరసరావుపేట ఈస్ట్: మండే వేసవిలో చల్లదనాన్ని అందించి హాయి గొలిపేలా సింగిల్ సినిమా ప్రేక్షకుల ఆదరణతో బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకుందని ఆ సినిమా హీరో శ్రీవిష్ణు తెలిపారు. సింగిల్ సినిమా విజయ యాత్రలో భాగంగా బుధవారం చిత్ర యూనిట్ పల్నాడుజిల్లా కేంద్రమైన నరసరావుపేటలో సందడి చేసింది. సినిమాను ప్రదర్శిస్తున్న కాసు మాల్‌లోని గీతా మల్టీప్లెక్స్‌లో థియేటర్‌లో హీరో శ్రీవిష్ణు, హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానా, దర్శకుడు కార్తీక్ రాజులు సందడి చేసారు. హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ, వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని కుటుంబ సమేతంగా సినిమాను చూసేలా కామెడీ ఎంటర్‌టైనర్‌గా దర్శకుడు కార్తీక్ రాజు ప్రేక్షకులకు అందించారని తెలిపారు. తనకు తాను తన జీవితాన్ని మలచుకునేలా, తనకు నచ్చిన రీతిలో జీవితంలో ఎదగాలని సూచించేలా సినిమా నిర్మించినట్టు తెలిపారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై సినిమా చేయటం, అది బ్లాక్‌బస్టర్ కావటం తన అదృష్టంగా భావిస్తున్నానని ఆనందం వ్యక్తం చేశారు. దర్శకుడు కార్తీక్ రాజు మాట్లాడుతూ, సింగిల్ సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. సినిమాలోని ప్రతి సన్నివేశం ప్రేక్షకులను నవ్విస్తుందన్నారు. హీరోయిన్లు కేతిక శర్మ, ఇవానా మాట్లాడుతూ, వేసవి సెలవుల్లో తాము నటించిన సింగిల్ విజయవంతం కావటం ఆనందంగా ఉందన్నారు.

పవర్ లిఫ్టర్ షానూన్‌కు సత్కారం




జ్ఞాపికను బహూకరిస్తున్న మోహన్ శ్యాంప్రసాద్

తెనాలి: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగిన ఆసియన్ సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సహా నాలుగు పతకాలు సాధించిన మదిర షానూన్‌ను బుధవారం స్థానిక కేవీఐకే జిమ్‌లో సత్కరించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ పారిశ్రామికవేత్త, డబుల్ హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల మోహన్‌శ్యాం ప్రసాద్ హాజరయ్యారు. షానూన్‌ను సత్కరించారు. ఆమె విజయాలు క్రీడాలోకానికి స్ఫూర్తినిచ్చేవని చెప్పారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలను సాధించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. జిమ్ శిక్షకురాలు, అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ ఘట్టమనేని సాయిరేవతి మాట్లాడుతూ తెనాలికి చెందిన షానూన్ కేఎల్ యూనివర్సిటీలో బీబీఏఎస్ డిగ్రీ చదువుతూ, తెనాలి కేవీఐకే జిమ్‌లో సాధన చేస్తోందని చెప్పారు. రాష్ట్ర, జాతీయస్థాయి పతకాలను సాధించిన తర్వాత తొలిసారిగా ఆసియా స్థాయి పోటీల్లో జూనియర్స్ విభాగంలో 47 కిలోల కేటగిరీలో పోటీ పడిందని తెలిపారు. రజత, మూడు కాంస్య పతకాలను సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. కేవీఐకే స్పోర్ట్స్ అకాడెమీకి తొలి అంతర్జాతీయ పతకాన్ని అందించినట్టు తెలిపారు. అకాడమీ తరఫున కొమ్మినేని భార్గవ్‌కుమార్, కోచ్ పూసపాటి శివరామకిరణ్‌రాజు, ఇతర లిఫ్టర్లు షానూన్‌ను సత్కరించారు.

బులియన్ అమ్మకాల్లో నిబంధనలు తప్పనిసరి

నెహ్రూనగర్: బంగారు వస్తువుల అమ్మకాల్లో లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆ శాఖ జాయింట్ కంట్రోలర్ ఎంఎస్ఎస్ మాధురి తెలియజేశారు. పట్నంబజార్‌లోని గుంటూరు బులియన్ జ్యుయలరీ అండ్ పాన్ బ్రోకర్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్‌లో బుధవారం బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బులియన్ లావాదేవీల్లో మిల్లీగ్రామ్‌కు కూడా కచ్చితమైన వేయింగ్ మెషిన్ వాడాలని సూచించారు. బిల్లు క్యారటేజ్ అనుగుణంగా ఉండాలని తెలిపారు. బంగారానికి గ్రాము ధర ఉండాలన్నారు. రాళ్లు పొదిగిన ఆభరణాల బిల్లులో బంగారానికి, రాళ్లకు వేరుగా, పరిమాణం, చెల్లించాల్సిన పైకం కూడా వేర్వేరుగా ఉండాలని సూచించారు. బంగారం వెయిట్ చూసే ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషిన్‌ను ప్రతి సంవత్సరం విధిగా లీగల్ మెట్రాలజీ వారితో ధ్రువీకరించుకోవాలని తెలిపారు. లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ షాలేంరాజు, అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్‌రాజు పాల్గొన్నారు.

కమ్మ జన సేవా సమితిలో విద్యార్థినులకు ప్రవేశాలు



ప్రగతి పత్రాలను ఆవిష్కరిస్తున్న సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్, పున్నయ్య చౌదరి

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినులు ఆశ్రయం పొందడానికి కమ్మ జన సేవా సమితిలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు తెలిపారు. కుందుల రోడ్డులోని కమ్మ జన సేవా సమితిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రగతి పత్రాల్ని ఆవిష్కరించారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడుతూ వసతి గృహంలో ప్రవేశాలకు ఇంటర్, బీటెక్, డిగ్రీ, ఫార్మసీ, పీజీతో పాటు బీడీఎస్, ఎంబీబీఎస్ కోర్సులు చదువుతున్న గ్రామీణ ప్రాంత విద్యార్థినులు ఈనెల 15 నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతిభ, పేదరికం ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు. రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, నామమాత్రంగా వసూలు చేస్తున్న ఫీజు నుంచి ప్రతి విద్యార్థినికి రూ.వెయ్యి మినహాయింపు ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిభ, పేదరికం, తల్లిదండ్రులు లేని విద్యార్థినుల నడవడిక, వసతిగృహంలో క్రమశిక్షణతో మెలిగే విధానాన్ని గమనించి, పాలకవర్గం కమిటీ ద్వారా ఎంపిక చేసిన విద్యార్థినులకు వార్షికోత్సవం రోజున ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున రూ.40 లక్షల ఉపకార వేతనాలు అందజేస్తామని వివరించారు. సంస్థ కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా దాదాపు 300 మంది విద్యార్థినులకు ఒక్కొక్కరికీ రూ.ఏడువేలు చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తున్నామని తెలిపారు. గుంటూరు వైద్య కళాశాలలో సీటు పొందిన విద్యార్థినులకు దాతల సహకారంతో ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులో రూ.50 కోట్ల వ్యయంతో రెండు వేల మంది విద్యార్థినులకు వసతి కల్పించే సామర్థ్యంతో నూతన భవన సముదాయాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. సంస్థ కార్యాలయంతో పాటు కమ్మ జన సేవాసమితి.కామ్ సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తులను ఈనెల 29లోపు సమితి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 0863–2355471, 2260666 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

SVNR రెడ్డి హాస్టల్, గుంటూరు-4
రెడ్డి హాస్టల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులందరికి ఆహ్వానం
ప్రతి ఒక్క పాత విద్యార్థి కూడా SVNR రెడ్డి హాస్టల్ పూర్వ విద్యార్థుల వాట్సప్ గ్రూప్‌లో చేరవలెను.
ఇట్లు అన్నపరెడ్డి పవన్ కుమార్ రెడ్డి
సెల్: 89786 09762, 94933 39695

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ నర్సింగ్(Girls) MLT వెటర్నరీ, అగ్రికల్చర్, ఫిజియోథెరపీ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. బాల బాలికలు హాస్టల్ వసతి కలదు. 7386706839, 7780494333

SERVICES
GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999
■ బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాన్ని మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ ✆ 8790741166

WANTED
■ ప్రముఖ స్టార్ హోటల్ "గీతారీజెన్సీ" నందు పనిచేయుటకు ఈ క్రింది సిబ్బంది వెంటనే కావలెను. ఇడ్లీ, పూరి & రైస్ మాస్టర్స్, ఆల్ రౌండర్స్, కిచెన్ అసిస్టెంట్స్, రెస్టారెంట్ వెయిటర్స్, రెస్టారెంట్ కెప్టెన్స్, రెస్టారెంట్ బాయ్స్, హౌస్ కీపింగ్ లేడీస్ & బాయ్స్, సెక్యూరిటీ, కిచెన్ సూపర్‌వైజర్స్, వెజ్ & నాన్ వెజ్ కిచెన్ ఇన్‌ఛార్జ్ కావలెను. అనుభవమును బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర: 4/1, అరండల్‌పేట, గుంటూరు. 99490 77525
■ అరండల్‌పేట నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్, అనుభవం గలవారు కావలెను. T: 10-6, Q: 10th-డిగ్రీ ✆ 93980 50488
■ Wanted Accounts Executive to work a reputed company at Guntur. Mini.2 to 3yrs. Experience in tally Cont: 9133399257
■ ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు స్త్రీలు హాస్టల్ వార్డెన్స్ మరియు హాస్టల్ ఇన్‌ఛార్జీస్ కావలెను. వయస్సు: 21 సం.పైన ఉండవలెను. జీతము: 10000/- నుండి 14000/- వరకు ఇవ్వబడును. ఉచిత భోజనం మరియు వసతి సౌకర్యం కలదు. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 92487 33329
■ గుంటూరు సిటీలో పనిచేయుటకు జెంట్స్ సెక్యూరిటీగార్డ్స్ కావలెను. అర్హత: 10th P/F 12గం॥ డ్యూటీ 13,000, వయస్సు: 25-45 సం॥ 9502087373
■ తెనాలి, మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ లోని మా ఆఫీసు నందు ప్లేస్‌మెంట్స్ కలవు. Any Qualification సంప్రదించగలరు. Ph: 9494351453
■ SRI SARADHA NIKETAN Public School MARTUR, BAPATLA District Wanted Jobs: Maths, Physics, Chemistry. Qualification: M.sc, B.Ed (Exp :5-10 Yrs with JEE-MAINS, NEET) Data Entry Operators-2 Accountancy B.S-1 M.COM /MBA Ph no: 7095723036, 9398832060
■ తన్మయి ఓల్డేజ్ హోమ్, YSR సర్కిల్ వద్ద VJA పెద్దవారికి సేవ చేయుటకు అనుభవంగల ఆడా, మగ వర్కర్లు, వంట మనుషులు కావలెను. వ. 20 నుండి 50 సం. 9652423559, 7093911010, 9573000987
■ గుంటూరు ఏటుకూరు బైపాస్ వద్ద గల అశోక్ లేలాండ్ సర్వీస్ సెంటర్‌లో (రఘువీర్ ఆటో మోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్) పని చేయుటకు అనుభవం గల సీనియర్, జూనియర్, టెక్నీషియన్స్, హెల్పర్స్ సర్వీస్ మేనేజర్స్ (అశోక్ లేలాండ్ కంపెనీలో దోస్త్ వెహికల్స్ నందు పని చేసిన వారు మాత్రమే) కావలెను. సంప్ర॥ 7337384894, 7674059621
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18k Ph: 9160900024, 9640400073

ఈ పేజీలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశేషంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

భారత ప్రభుత్వము, ఆర్థిక మంత్రిత్వ శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్
31-31-21, గ్రౌండ్ & 1వ అంతస్తు, నారాయణ భవనం, సాయిబాబా వీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం-530020.
ఫోన్: 0891-2957044, ఇ-మెయిల్: ro1.drt_vskp@outlook.com
RP No. 456/2018 In O.A No. 531/2017
[illegible]
M/s. [illegible]
విషయం: వేలం అమ్మకం వాయిదా ప్రకటన
[illegible] 28.02.2025 [illegible] https://www.bankeauctions.com [illegible] 25.04.2025 [illegible] 16.05.2025 [illegible] 06.06.2025 [illegible] https://www.bankeauctions.com [illegible] 28.02.2025 [illegible] 04.06.2025 [illegible] 4.00 [illegible] 06.06.2025 [illegible] 4.00 [illegible] 28.02.2025 [illegible]
(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రితో విశాఖపట్నం వద్ద తేది. 14.05.2025 న జారీచేయడమైనది)
(అధికారాల ఆఫీస్) రికవరీ ఆఫీసర్
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్, విశాఖపట్నం